ఉర్దూ విద్యపై నిర్లక్ష్యపు నీడలు

- టీచర్ల కొరత..తడబడిన చదువు
- నాలుగు పాఠశాలల్లో సింగిల్ టీచర్‌తోనే నెట్టుకొస్తున్న వైనం
- 9 పాఠశాలల్లో 922 మంది విద్యార్థులకు 21 మంది ఉపాధ్యాయులే
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



24వ వార్డులోని అజాద్ ఉర్దూ ప్రైమరీ స్కూల్‌లో బోధిస్తున్న సింగిల్ టీచర్


రాయదుర్గంటౌన్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యాభివృద్ధికి పెద్దపీట వేశారు. కార్పొరేట్ స్థాయిలో పాఠశాలలను తీర్చిదిద్దారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పాఠశాలల స్థితిగతులు మారిపోయాయి. 'నాడు' నేడు అన్న రీతిలో సమస్యలు తిష్ట వేశాయి. ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. నిబంధనల మేరకు పాఠశాలలో కనీసం 20 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాల్సి ఉంది. విద్యాధికారులు పట్టించుకోవడంలేదు. కనీసం వర్క్ అడ్జెస్ట్‌మెంట్ లేదా డెప్యుటేషన్‌పైనా ఉపాధ్యాయులను నియమించకపోవడంతో ఉర్దూ పాఠశాలల్లో విద్యార్థులకు విద్య సక్రమంగా అందడంలేదు. రాయదుర్గం పురపాలక సంఘంలోని ఉర్దూ మీడియం మున్సిపల్ పాఠశాలల్లో సమస్యలు తిష్ట వేశాయి. పట్టణంలో ఒక ఉర్దూ హైస్కూల్‌తోపాటు ఒక అప్పర్ ప్రైమరీ, ఏడు ప్రాథమిక ఉర్దూ పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 922 మంది విద్యార్థులు ఉర్దూ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. 41 ఉపాధ్యాయ పోస్టులు ఉండాల్సి ఉంది. కేవలం 21 మందితో సరిపెట్టారు. శాంతినగర్‌లోని డీపెప్ ఉర్దూ స్కూల్, హిమ్మతనగర్‌లోని మహమ్మద్ అలీ జోహర్ స్కూల్ ప్రహరీలు శిథిలావస్థకు చేరుకున్నాయి. 24వ వార్డు గొందిబావి ఏరియాలోని అజాద్ ఉర్దూ స్కూల్‌లో పై అంతస్తులోని తరగతి గదులకు వెళ్లే మెట్ల మార్గం పూర్తిగా శిథిలమైంది. వర్షం వస్తే గదులు కారుతున్నాయి.

ఏకోపాధ్యాయుడితోనే బోధన :

పట్టణంలోని నాలుగు ఉర్దూ పాఠశాలల్లో కేవలం ఒక ఉపాధ్యాయుడే ఉన్నారు. గొందిబావి ఏరియాలోని నెహ్రూ ఉర్దూ స్కూల్ (60 మంది విద్యార్థులు), శాంతినగర్‌లోని డీపెప్ ఉర్దూ స్కూల్ (58 మంది విద్యార్థులు), జీఆర్ఎస్ కాలనీలోని మహమ్మద్ అలీ జోహార్ ఉర్దూ స్కూల్ (44 మంది విద్యార్థులు), హిమ్మత్ నగర్‌లోని ఉర్దూ ప్రాథమిక పాఠశాల్లో (32 మంది విద్యార్థులు) కేవలం ఒక ఉపాధ్యాయుడు మాత్రమే పని చేస్తున్నారు.

ఉర్దూ హైస్కూల్‌లోనూ వేధిస్తున్న టీచర్ల కొరత..

పట్టణంలోని ఏకైక రాజీవ్‌గాంధీ మున్సిపల్ ఉర్దూ హైస్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు 350 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 16 పోస్టులు ఉండాలి. కానీ ఇక్కడ 9 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఆత్మకూరు వీధిలోని అంజుమన్ అజ్మతుల ఇస్తాం (ఏఏఐ) అప్పర్ ప్రైమరీ స్కూల్ అప్‌గ్రేడ్ అయినప్పటి నుంచి ఇద్దరు ఎస్‌జీటీలతోనే నెట్టుకొస్తున్నారు. ఇక్కడ 142 మంది విద్యార్థులు చదువుతున్నారు. నిబంధనల మేరకు ఇద్దరు ఎస్‌జీటీలు, ఆరుగురు స్కూల్ అసిస్టెంట్లు ఉండాల్సి ఉండగా, ఇద్దరు ఎస్‌జీటీలు మాత్రమే ఉన్నారు. నియోజకవర్గంలోనే మొట్ట మొదటి ఉర్దూ ప్రాథమిక పాఠశాల అయిన డి.హీరేహాళ్‌లోని ఉర్దూ స్కూల్‌లో ఈ ఏడాది విద్యా సంవత్సరం నుంచి తెలుగు టీచర్‌తో నెట్టుకొస్తున్నారు.



అజాద్ ఉర్దూ స్కూల్ పైఅంతస్తుకు వెళ్లే మెట్ల మార్గం పూర్తిగా నేలకూలిన దృశ్యం

ఉర్దూ టీచర్లను నియమించాలి



పట్టణంలోని ఉర్దూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు ఉపాధ్యాయులను నియమించాలి. నాలుగు ఉర్దూ ప్రాథమిక పాఠశాల్లో సింగల్ టీచర్ ఉన్నారు. రాజీవ్ గాంధీ ఉర్దూ హైస్కూల్, అంజుమన్ యూపీ స్కూళ్లలో ఉపాధ్యాయుల కొరత ఉంది. పోస్టుల భర్తీ చేసే వరకూ కనీసం వలంటీర్లనైనా నియమించాలి.

– అబ్దుల్ వారిస్, హెచ్ఎం, ఎస్ఆర్‌జే ఉర్దూ మున్సిపల్ హైస్కూల్ కాంప్లెక్స్

ఉర్దూ విద్యపై నిర్లక్ష్యం



కాలనీలోని నెహ్రూ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో మా పిల్లలు చదువుతున్నారు. పాఠశాల పరిస్థితి అధ్వానంగా ఉంది. 60 మంది పిల్లలుంటే ఒకే ఉపాధ్యాయుడు ఉన్నారు. పిల్లలకు మంచి విద్య ఎలా దక్కుతుందో అధికారులకే తెలియాలి. ఇటీవల పైఅంతస్తులోని తరగతి గదులకు వెళ్లే మెట్ల మార్గం కూలిపోయింది. కింద ఉన్న గదిలో వర్షకాలంలో కారుతోంది. అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు.

– మహబూబ్‌బాషా, ఖుద్దూస్‌సాబ్, 24వ వార్డు, నెహ్రూ ఉర్దూ స్కూల్ ఏరియా, రాయదుర్గం

అల్లామార్గం అనుసరణీయం



తొలి రోజు జుమా తరువాత ప్రసంగిస్తున్న మౌలానా నిసార్‌సాబ్



సామూహిక ప్రార్థనల్లో నిమగ్నమైన ముస్లింలు

రాయదుర్గంటౌన్: మహమ్మద్ ప్రవక్త జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని అల్లా చూపిన మార్గంలో నడిస్తేనే జీవితానికి సార్థకత లభిస్తుందని మౌలానా నిసార్‌సాబ్ పేర్కొన్నారు. శుక్రవారం తబ్లిక్ జమాత్ రాయదుర్గం డివిజన్(మర్కస్)కు చెందిన సరిహద్దు కర్ణాటకలోని మొలకాల్మూరులో రెండు రోజుల పాటు జరిగే ఇస్లామిక్ సమ్మేళనం (ఇస్తెమా) జోహర్ నమాజ్‌తో అట్టహాసంగా ప్రారంభమైంది. ఇస్తెమాకు రాయదుర్గం డివిజన్ పరిధిలోని రాయదుర్గం, మొలకాల్మూరు, కణేకల్లు, కళ్యాణదుర్గం, కంబదూరు, వైఎన్ హొసకోట ప్రాంతాల నుంచి వేలాదిగా ముస్లింలు తరలివచ్చారు. ఇస్లాం బోధనలు, అల్లా వ్యాఖ్యలు, దైవ ప్రవక్త మహమ్మద్ (సొఅసొ) గుణగణాలు, ఇతరాత్ర బోధనలు చేసేందుకు బెంగళూరు నుంచి తొలిరోజు మౌలానా నిసార్‌సాబ్ హాజరై ప్రసంగించారు. హాజరైన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఇస్తెమా నిర్వాహకులు, మత పెద్దలు ఏర్పాట్లు చేశారు.

ప్రవక్త మార్గంలో నడవాలి:

అల్లా విధేయులుగా మహ్మద్ ప్రవక్త (సొఅసొ) చూపిన సన్మార్గంలో పయనిస్తూ అపకారం తలపెట్టిన వారికి కూడా ఉపకారం చేసి దేవుడి (అల్లా) కృపకు పాత్రులు కావాలని మౌలానా నిసార్‌సాబ్ అన్నారు. అల్లామార్గంలో మంచి, చెడులను గుర్తించి సాటి పేదలను ఆదుకోవడం, ఐదుపూటల నమాజ్ ఇస్లాం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఇస్తెమా రెండో రోజు శనివారం బెంగళూరు నుంచి మరికొందరు ఉలెమాలు హాజరై బోధనలు చేయనున్నట్లు చెప్పారు. శనివారం రాత్రి ఇషా నమాజ్, సామూహిక ప్రత్యేక దువా కార్యక్రమాలతో ఇస్తెమా ముగియనున్నట్లు చెప్పారు.

పార్కులో చెట్ల నరికివేతపై ఫిర్యాదు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డులోని డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పార్కులో చెట్లు నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున, సీనియర్ నాయకుడు నాగరాజు, మధు తదితరులు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ముగ్గురు ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే ముగ్గురు మున్సిపల్ సిబ్బందే పార్కులో దాదాపు పది చెట్లను నరికి సొమ్ము చేసుకున్నట్లు తెలిపారు.

పల్లెలను పరిశుభ్రంగా ఉంచుదాం

గుమ్మఘట్ట: పల్లెలను పరిశుభ్రంగా ఉంచుదామని ఎంపీడీఓ రామకృష్ణ పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 18న స్వచ్ఛత కోసం ప్రతి ఒక్కరూ అంకితం కావాలన్నారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు.

విధులపై అలసత్వం వహిస్తే చర్యలు

కూడేరు: విధులపై అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎంపీడీఓ కుళ్లాయి స్వామి సూచించారు. శుక్రవారం గొటుకూరు, కమ్మూరు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, ప్రజలకు అందిస్తున్న సేవలకు సంబంధించిన రిజిష్టర్లను ఆయన పరిశీలించారు.

సంక్షిప్త సమాచారం

కార్యక్రమంలో ఈఓఆర్డీ రాధాకృష్ణ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో భవిష్యత్ నాశనం

కంబదూరు: యువత గంజాయి, మాదక ద్రవ్యాలను వినియోగించి భవిష్యత్తులను నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ సీఐ సునీల్‌కుమార్, ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం ఒంటారెడ్డిపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎక్సైజ్ పోలీసులు గంజాయి, మాదక ద్రవ్యాలను వినియోగించడం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు అవగాహన కల్పించారు.

వ్యక్తి ఆత్మహత్య



గంటె అంజినప్ప మృతదేహం

శెట్టూరు: మండలంలోని చిన్నబలపంపల్లిలో బోయ గంటె అంజినప్ప (50) పురుగుల మందు తాగి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. అంజినప్ప పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఎడమచేయి, ఎడమకాలు పనిచేయలేదు. దీంతో మనస్థాపానికి గురై గురువారం పొలానికి వెళ్లి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కర్ణాటకలోని ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం ఉదయం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాంభూపాల్ తెలిపారు.


ఆశలు 'వరి'ంచాలంటే..
నాట్లు పోట్లు గట్టెక్కాల్సిందేనా?

- రబీ సీజన్‌లో జోరుగా వరి నాట్లు
- ఏటేటా భారమవుతున్న కూలీల రేట్లు, సాగు ఖర్చులు
- హెచ్చెల్సీకి నీరొస్తుందని సాగు వైపు మొగ్గు

బొమ్మనహాళ్: ఖరీఫ్ పూర్తయ్యింది.. రబీ ప్రారంభమైంది. దీంతో అన్నదాతలు ఆశగా వరి సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. హెచ్చెల్సీకి ఈ సారి నీళ్లొస్తాయని ఆయకట్టుకింద ముమ్మరంగా సాగు చేస్తున్నారు. అయితే ఈసారి గిట్టుబాటు ధరలు లేక వరి రైతు 'వెల'విలలాడుతున్నాడు. దీనికితోడు సాగు ఖర్చులు, కూలీల రేట్లు ఏటేటా భారమవుతున్నాయి. రబీ అయినా గట్టెక్కిస్తుందని సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజవర్గాల్లో బోర్లు, చెరువుల కింద రబీలో 3,768 హెక్టార్లలో వరి సాగు అయ్యే అవకాశం ఉంది. ఆర్93, కేఎన్ఎం 1638, కేఎన్ఎం 733, ఆర్ఎన్ఆర్, గంగా కావేరి రకాలను ఎక్కువగా ఎంచుకుంటున్నారు. బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్, మండలాల్లోని కొలగానహళ్లి, లింగదహాళ్, శ్రీరంగాపురం క్యాంపు, ఉద్దేహాళ్, శింగానహళ్లి, యర్రగుంట, కణేకల్లు, గోనేహాళ్, అంబాపురం, తుంబిగనూరు, గంగలాపురం , తిమ్మలాపురం, నాగలాపురం తదితర గ్రామాల్లో నాట్లు వేస్తున్నారు.

పెరిగిన వరి నాట్లు, కూలీ రేట్లు :

ప్రస్తుతం జోరుగా వరి నాట్లు జరగడంతో కూలీ రేట్లు ఆకాశాన్నంటున్నాయి. ఎకరం వరి నారు తీసి నాట్లు వేయడానికి రూ. 4వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. గతంలో కన్నా ఇప్పుడు రూ. 500 నుంచి రూ. వెయ్యి వరకు పెరిగింది. నాట్లు వేయడానికి ఒక మనిషికి కూలి రూ. 250 నుంచి రూ. 300 వరకు ఉంది. సెంటు నారు ధర రూ.1,500 వరకు పలుకుతోంది. నాట్లు జోరుగా సాగుతున్నందున మరింత డిమాండ్ పెరిగింది. దీంతో అన్నదాతలు వరి సాగుకు అవస్థలు పడుతున్నారు.



బోర్ల కింద సాగైన వరి పంట



ఎద్దులతో దుక్కి దున్నుతున్న రైతులు



వరి నారును కట్టలు కడుతున్న కూలీలు

తడిసి మోపెడవుతున్న ఖర్చులు :

ప్రస్తుతం రైతులు వరి సాగు చేయడానికి ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి. ఎకరా వరి నాటు వేయడానికి రూ. 4 వేలు, పెరిగిన డీజిల్ ధరలతో రైతులకు దుక్కి పనులు భారంగా మారాయి. ఎకరం పొలం టిల్లర్‌కు రూ.700, రోటావేటర్ గంటకు రూ.1,300, దమ్ము చేయడానికి రూ. 1,800 వరకు ఉంది. రసాయన ఎరువులు ఎకరానికి నాలుగు కాంప్లెక్స్ ఎరువులు, మూడు యూరియా బస్తాలకు రూ. 7 వేలు, క్రిమిసంహారక మందులు రూ. 6 వేలు, వరి కోతకు రూ. 4,500 వరకు కానుంది. ఇక రెండుసార్లు కలుపు తీయడానికి, మందులు పిచికారీకి, ఎరువులు చల్లడానికి రూ. 5 వేలు వరకు వస్తాయి. దీంతో ఎకరానికి రూ. 35 వేల నుంచి రూ. 40 వేల వరకు ఖర్చు కానుంది. ప్రభుత్వం అన్నదాతలను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులు రబీ కింద వరి సాగు చేయు రైతులు తగిన యజమాన్య పద్ధతులు పాటించాలి. రైతులు విచక్షణారహితంగా రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడరాదు. నత్రజని ఎరువులను తగ్గించాలి. క్రిమిసంహారక మందుల వాడకం తగ్గించాలి.

– సాయికుమార్, ఏఓ, బొమ్మనహాళ్

సంతోషంతో సాగు చేశాం



ఈ ఏడాది ఎన్నడు లేని విధంగా తుంగభద్ర జలాశయంలోకి వరద నీరు పొట్టేంది. జలాశయం ఎగువ భాగాల్లో కురుస్తున్న వర్షాలకు జలాశయం పూర్తి స్థాయిలో నిండి ఫిబ్రవరి నెల ఆఖరు వరకు నీరు వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో రెండో పంట కింద వరినారు పోసుకుని వరినాట్లు వేడయం ప్రారంభించారు. వరి సాగుకు మంచి దిగుబడి వచ్చేందుకు ముందస్తు చర్యలు చేపట్టాం. ఆయకట్టు నీరు బంద్ అయినా బోర్ల ద్వారా సాగు చేసుకుంటాం. ఈసారి పంటల దిగుబడి కూడా ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయి.

– ప్రసాద్‌రెడ్డి, ఉద్దేహాళ్ గ్రామం, బొమ్మనహాళ్ మండలం

ప్రభుత్వం సాయం చేయాలి



రబీ సీజన్ వచ్చిందంటే సాగు చేసేందుకు పెట్టుబడి అవసరం. రబీ సీజన్‌లో సాగు చేసే రైతులకు ప్రభుత్వం సాయం అందిస్తే రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. రైతులను ప్రభుత్వం పట్టించుకోకపోతుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెట్టుబడులను ప్రైవేట్ వ్యక్తుల వద్ద రూ.వేలు అప్పు చేసి వ్యవసాయం చేస్తున్నారు. ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందిస్తే రైతులు బాగుపడతారు.

– హనుమేష్, రైతు దేవగిరి గ్రామం , బొమ్మనహాళ్ మండలం

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ మారుతమ్మ

కళ్యాణదుర్గం రూరల్: గ్రామాల్లోని సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని ఎంపీపీ మారుతమ్మ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీడీఓ రామచంద్ర, వైస్ ఎంపీపీలు కాంతమ్మ, అనురాధ, మండల జేసీఎస్ కన్వీనర్ ఆంజనేయులు, సర్పంచ్‌లు శోభారాణి, హనుమంతు, చంద్రనాయక్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో ఊరు దేవర

కూడేరు: కడదరకుంటలో బొడ్రాయి ప్రతిష్ట సందర్భంగా ఈ నెల 20,21న ఊరు దేవర , 21,22న ఉదిరిపికొండలో గ్రామ దేవత పెద్దమ్మ ఊరు దేవర, ముద్దలాపురంలో ముత్యాలమ్మ దేవత విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఊరు దేవర జాతర నిర్వహించనున్నట్లు ఆయా గ్రామాల పెద్దలు, నిర్వాహకులు శుక్రవారం తెలిపారు.

కుష్టు నిర్ధారణ సర్వేపై శిక్షణ



ఆశా వర్కర్లకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : స్థానిక పీహెచ్‌సీలో కుష్టు నిర్ధారణ సర్వేపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. వైద్యాధికారి రాజేష్‌కుమార్ మాట్లా డుతూ కుష్టు నిర్ధారణపై జనవరి 20 నుంచి ఫిబ్రవరి 2 వరకు సర్వే ఉంటుందన్నారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రతి కుటుంబంలోని ప్రతి ఒక్కరితో మాట్లాడి వివరాలు సేకరించాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ రామలక్ష్మీ, ఏఎన్ఎంలు , ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: స్థానిక పీహెచ్‌సీలో కుష్టువ్యాధి నిర్ధారణ సర్వే పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. వైద్యాధికారి సర్దార్‌వలి మాట్లాడుతూ జనవరి 20 నుంచి ఫిబ్రవరి 2 వరకు కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సర్వే చేయనున్నట్లు తెలిపారు. ఆరోగ్య విస్తరణ అధికారి గురుప్రసా ద్, సూపర్‌వైజర్ నాగశంకర్, ఏఎన్ఎంలు సు క న్య, తిరుమలదేవి, ఆశా కార్యకర్తలు పా ల్గొ న్నారు.

విధులపై అలసత్వం తగదు

గుమ్మఘట్ట: విధులపై అలసత్వం తగదని, అంకితభావంతో పనిచేయాలని పీహెచ్‌సీ వైద్యులు రమేష్ తెలిపారు. పీహెచ్‌సీ సిబ్బందితో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలన్నారు. నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించేది లేదన్నారు.

వైభవంగా ధ్వజావిష్కరణ



అలంకరణలో మల్లేశ్వర స్వామి

ఉరవకొండ: పట్టణంలోని ప్రసిద్ధ మల్లేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ధ్వజావిష్కరణ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయ గోపురం కలశంపై జెండా ఎగరేసి, పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి మూల విరాట్‌కు అభిషేకం, మహా మంగళహారతి, రుద్ర హోమం నిర్వహించారు. మండల దీక్షతో పాటు ఫిబ్రవరి 2 నుంచి అర్ధ మండల దీక్ష, ఫిబ్రవరి 12న భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి గ్రామోత్సవం, మహాశివరాత్రి సందర్భంగా 26న దీక్షా విరమణ ఉంటుందన్నారు. ఈనెల 17 నుంచి 25 వరకు అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

21న పోతప్పస్వామి జాతర



ఉమాను ఆహ్వానిస్తున్న నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: దాసంపల్లిలో ఈ నెల 21న పోతప్ప స్వామి జాతర నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. ఈమేరకు జాతరకు రావాలని వైఎస్సార్‌సీపీ నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడును ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు తలారి సత్తి, జయపాల్‌రెడ్డి, శ్రీధర్, తిమ్మారాయుడు, అనుమన్న, రామ్మూర్తి, కొల్లన్న పాల్గొన్నారు.

వివాహం చేసుకోవాలని యువకుడి ఇంటి వద్ద నిరసన

వజ్రకరూరు: తనను వివాహం చేసుకోవాలని కొనకొండ్లలో యువకుడి ఇంటి వద్ద ఓ యువతి శుక్రవారం నిరసన తెలియజేసింది. సదరు యువతికి గుంతకల్లుకు చెందిన మహిళా సంఘాల ప్రతినిధులు మద్దతు తెలిపారు. చుట్టుపక్కల వారు డయల్ యువర్ 100కు సమాచారం అందించారు. ఎస్ఐ నాగస్వామి తన సిబ్బందితో కొనకొండ్లకు చేరుకొని విచారించారు. అనంతరం ఇరువర్గాల వారు పోలీస్ స్టేషన్‌కు చేరాయి. కాగా ఎస్ఐ మాట్లాడుతూ కొనకొండ్లకు చెందిన యువతి ఏడాది క్రితం గ్రామానికి చెందిన ఓ యువకుడు తనను ప్రేమించి మోసం చేశాడని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అప్పట్లో కేసు నమోదు చేసి సదరు యువకుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రస్తుతం సదరు కేసు ఉరవకొండ కోర్టులో నడుస్తున్నట్లు తెలిపారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- పశుసంవర్థక శాఖ డీడీ డాక్టర్ వెంకటేష్

ఉరవకొండ: గ్రామాల్లో పశువైద్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక పశుసంవర్ధక శాఖ డీడీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈనెల 20 నుంచి 31 వరకు 12 రోజుల పాటు ప్రతి మండలంలో రోజూ రెండు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. పశువైద్య సిబ్బంది రెండు టీంలుగా విడిపోవాలన్నారు.

దంపతులపై దూసుకెళ్లిన ఐచర్ వాహనం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని కుందిర్పి రోడ్డు వద్ద దంపతులపై ఐచర్ వాహనం దూసుకెళ్లిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. పట్టణంలోని కమ్మవారిచెట్ల వీధికి చెందిన వన్నురస్వామి అరుణ భార్య భర్తలు. వీరు చెర్లోపల్లి గ్రామంలో మామిడిచెట్లను కౌలుకు తీసుకున్నారు. శనివారం ఉదయం చెర్లోపల్లికి వెళ్లడం కోసం వన్నురస్వామి భార్య అరుణ తమ పిల్లలతో కలిసి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. పట్టణం దాటిన వెంటనే కుందిర్పి రోడ్డు వద్ద ద్విచక్ర వాహనాన్ని పక్కన నిలిపాడు. అదే సమయంలో ముందు ఉన్న ఐచర్ వాహనం ఒక్కసారిగా వెనుక వైపునకు (రివర్స్‌లో) దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో వన్నూరస్వామి, అరుణ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకు కోసం అనంతపురం తరలించారు. పట్టణ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన ఐచర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

చిల్డ్రన్స్ హోంల తనిఖీ



ఉరవకొండలో ఆర్ఫన్స్ చిన్నపిల్లల ఆశ్రమంలో మాట్లాడుతున్న పర్యవేక్షణ కమిటీ సభ్యులు

ఉరవకొండ: ఉరవకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఫస్ట్ అర్బన్ హోమ్, చిల్డ్రన్ హోంలను జిల్లా పర్యవేక్షణ కమిటీ సభ్యులు శుక్రవారం తనిఖీ చేశారు. చిల్డ్రన్స్ హోంలో రికార్డుల పనితీరు, నిర్వహణ తదితర అంశాలపై పరిశీలించారు. పర్యవేక్షణ కమిటీ టీం కన్వీనర్ ఫరూక్‌బాషా, కోకన్వీనర్ మంజునాథ్, సభ్యులు డాక్టర్ బీఎస్ శ్రీదేవి(ఉరవకొండ ఐసీడీఎస్ సీడీపీఓ) ప్రొటెక్షన్ అధికారిణి వెంకటేశ్వరీ, ఎల్‌పీఓ సంధ్యారాణి హోంలను పరిశీలించారు. అనంతరం సభ్యులు డాక్టర్ బీఎస్ శ్రీదేవి మాట్లాడుతూ బాలల న్యాయ చట్టం 2015 ప్రకారం చిల్డ్రన్స్ హోం రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో పర్యవేక్షణ చేసినట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ యాక్టివిటీ సెక్రటరీకి సన్మానం



యాక్టివిటీ సెక్రటరీ ఎర్రంపల్లి కృష్ణమూర్తిని సన్మానిస్తున్న నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: వైఎస్ఆర్‌సీపీ జిల్లా యాక్టివిటీ సెక్రటరీ ఎర్రంపల్లి కృష్ణమూర్తిని వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం సన్మానించారు. పట్టణంలోని జిల్లా యాక్టివిటీ సెక్రటరీ ఎర్రంపల్లి కృష్ణమూర్తిని నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు రేవన్న, మున్సిపాల్ చైర్మన్ రాజ్‌కుమార్, మాజీ ఎంపీపీ వన్నూరస్వామి, బోరంపల్లి రామిరెడ్డి, రామాంజనేయులు, గొల్ల సూరి, లక్ష్మన్న, దొడగడ్డ మురళి, జాని, ఉమాపతి, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోండి



ఉరవకొండలో పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలిస్తున్న అధికారులు

ఉరవకొండ: ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 20 వార్డుల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ రవిప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం ఉరవకొండ పట్టణంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించి అధికారులతో కలిసి వార్డుల్లో విస్తృతంగా పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. మేజర్ పంచాయతీ ఈఓ గౌస్‌సాహెబ్, మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి, ఈఓఆర్‌డీ సతీష్‌కుమార్‌ల బృందం 20 వార్డుల్లో పర్యవేక్షించారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం సురక్షితం

వజ్రకరూరు: ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు సురక్షితమని ఏఎన్ఎం పద్మావతి తెలిపారు. శుక్రవారం మండలంలోని కొనకొండ్ల గ్రామంలోని అంగన్‌వాడీ (02) కేంద్రంలో వీహెచ్ఎన్‌డీ (విలేజ్‌హెల్త్ న్యూట్రిషన్‌డే) కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బాబావలి,అంగన్‌వాడీ కార్యకర్త సువర్ణమ్మ, ఆయా చంద్రకళ, ఆశా కార్యకర్తలు శాంతమ్మ, సుజాత పాల్గొన్నారు.